సాక్షి
నిర్మల్
గురువారం । 8 । ఆగస్టు । 2024



సైబర్‌మోసాల ముఠా అరెస్టు

జల్సాలకు అలవాటుపడి సైబర్ మోసాలకు పాల్పడుతున్న రాజస్థాన్ ముఠాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. 8లో▸



ఆచారం.. మారేదెలా..!

మహిళలు అంతరిక్షంలో వెళ్తున్న నేటి తరుణంలోనూ ఉమ్మడి జిల్లాలో ఓ ఆచారం మహిళలకు ప్రాణసంకటంగా మారుతోంది. కొలాం ఆదివాసీల్లో చైతన్యం రావాల్సి ఉంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /24.0

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'గుండేగాం'ను సందర్శించిన అదనపు కలెక్టర్



గ్రామంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భైంసారూరల్: మండలంలోని గుండేగాం గ్రామాన్ని బుధవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, పారిశుధ్య, ఇతర పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక కార్యదర్శిగా నాలుగేళ్లుగా పనిచేస్తున్న నవీన్ రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగ రీత్యా బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తున్నారో తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిసింది. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, ఎంపీవో మోజం హుస్సేన్, తదితరులు ఉన్నారు.

పోలీసులు ప్రజలతో మమేకమవ్వాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

ఖానాపూర్: పోలీసులు ప్రజలతో మమేకమవ్వాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ సైదారావుతో పాటు సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు.

'నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలి'




మాట్లాడుతున్న నంది రామయ్య

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా హామీల అమలును పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు రాజన్న, లక్ష్మణ్, మంతు, నాగోరావు, రాము, బాపురావు, లక్ష్మి, గంగామణి పాల్గొన్నారు.

నిర్మల్ టు మంచిర్యాలకు ఆర్టీసీ బస్సు

నిర్మల్‌టౌన్: ప్రయాణికుల కోరిక మేరకు నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి మంచిర్యాలకు ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు నిర్మల్ బస్టాండ్ నుంచి సాయంత్రం 6 గంటలకు మంచిర్యాలకు బయలుదేరుతుందని, మరుసటి రోజు ఉదయం 6:15 నిమిషాలకు మంచిర్యాల నుంచి బయలుదేరి 10 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని డీఎం పేర్కొన్నారు.

'తిరంగా అభియాన్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అంజుకుమార్‌రెడ్డి

ఖానాపూర్: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న నిర్వహించనున్న 'హర్‌ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వేడుకల్లో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. యువమోర్చా, మహిళా మోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. సామ రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్, టీకు ప్రకాష్, వెంకటేష్, రమేష్, ఉపేందర్, గోపాల్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, బొజ్జు, అనిల్‌జాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీగౌడ్ తదితరులు

గుండెల్లో పెట్టుకుంటాం

- ఈ ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం..
- 'ఆదిలాబాద్'ను ముందు వరుసలో నిలుపుతాం..
- దత్తత పిప్రి గ్రామం నుంచి ఉమ్మడి జిల్లాపై డిప్యూటీ సీఎం వరాలు
- ఒక్కరోజుతో అయిపోయేది కాదు.. మళ్లీ వస్తా
- పాదయాత్ర ప్రారంభించిన నేలపై 'భట్టి' భావోద్వేగం



అభివాదం చేస్తున్న భట్టి

సాక్షి, ఆదిలాబాద్/బజార్‌హత్నూర్: 'పాదయాత్ర ప్రారంభించిన రోజు మీరంతా గుండెల నిండా ఆశీర్వదించి పంపించారు.. సీఎల్పీ నేతగా నేను ఓ వైపు.. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరోవైపు ఆదిలాబాద్ నుంచే యాత్రలు ప్రారంభించాం.. మీ ఆశీర్వాద బలంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలన్నింటిని విజయవంతంగా చేయగలుగుతున్నాం.. ఇప్పటికీ ఆదిలాబాద్ జిల్లాను వెనుకబడిన జిల్లా అని చెప్పుకోవడం బాధగా ఉంది. నేను ఈ విషయాన్ని ఒప్పుకోను.. ఈ జిల్లాను అన్ని జిల్లాల కంటే ముందుంచుతా.. ముఖ్యమంత్రితో పాటు నేను మా మంత్రివర్గ సహచరులందరూ ఈ జిల్లాను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం.. అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలోని పిప్రిలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో అన్నారు. గతేడాది మార్చి 16న ఇక్కడి నుంచే నా పాదయాత్ర ప్రారంభించా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది మార్చి 16న ఇక్కడికి రావాలనుకున్నా.. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో కుదరలేదు.. ఇప్పుడు ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది.. అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాపై పలు వరాలు కురిపించారు. బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించినట్లు తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరించి పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం విక్రమార్క, పక్కన ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..
ఐటీడీఏ ద్వారా బజార్‌హత్నూర్ మండలంలోని తొమ్మిది గిరిజన గ్రామాలకు రూ.1.50కోట్ల నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.60 లక్షల నిధులతో మూడు జీపీలకు నూతన భవనాల నిర్మాణం, పిప్రి నుంచి మోద గ్రామం వరకు రూ.2.67 కోట్ల నిధులతో బీటీ రోడ్డు, నేరడిగొండ మండలం వాంకిడిలో టీఎస్ఎన్పీడీసీఎల్ ద్వారా రూ.2.20 కోట్ల నిధులతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఆగిపోతుందని అంతా అనుకున్నారు..
మండుటెండల్లో ప్రారంభించిన నా పాదయాత్ర రెండు రోజులు.. లేదంటే రెండు గ్రామాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు.. అయితే ప్రజల సమస్యలను వింటూ 1,365 కిలో మీటర్లు పాదయాత్ర పూర్తి చేశాను.. పిప్రి ప్రజల ఆశీర్వాదంతోనే ఇదంతా జరిగింది. ఆ పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నాం.. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి ఒక బాధ్యతగా నడుచుకుంటున్నాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏ ఒక్క హామీని మర్చిపోకుండా అమలు చేస్తున్నాం. రూపాయి కూడా దుబారా కాకుండా ప్రజలకే ఉపయోగపడేలా చూస్తున్నామని భట్టి పాదయాత్ర రోజులను గుర్తు చేసుకుంటూ చెప్పారు.

మళ్లీ వస్తా..
ఇది ఒక్కరోజుతో అయిపోయే కార్యక్రమం కాదు. 32 రోజులు ఉమ్మడి జిల్లాలో నడిచాను. అనేక చోట్ల అనేక మందితో మాట్లాడాను. నిద్రించిన గ్రామాలెన్నో ఉన్నాయి. ఎక్కడెక్కడో బస చేశాను. ఆ ప్రతి గ్రామాన్ని సందర్శిస్తా. అక్కడ ఇచ్చినటువంటి ప్రతి మాటను నిలుపుకుంటా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చేస్తానంటూ భట్టి ఉమ్మడి జిల్లా ప్రజలకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, వెడ్మబొజ్జు పటేల్, అనిల్ జాదవ్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఈవో ప్రణీత, కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు, ఉప ముఖ్యమంత్రితో పాటు వచ్చిన ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరాలు ఇలా..

- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పునఃప్రారంభం. నాలుగైదు నెలల్లోనే పనులు ప్రారంభిస్తాం.
- పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు.
- పిప్రిలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు.
- కుప్టి ప్రాజెక్టు పూర్తి చేస్తాం. ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించాం.
- త్రివేణి సంగమం కడతాం. చెక్‌డ్యామ్ నిర్మిస్తాం. పులిమడుగును చేపడతాం.
- అడ వద్ద కుమురంభీం కాలువలు పూర్తి చేస్తాం. నీళ్లు పారిస్తాం.
- ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ కారణంగా మంచిర్యాల మునుగుతుంది. ఈ సమస్య పరిష్కారం కోసం రూ.260 కోట్లు మంజూరు. దీంతో రిటైనింగ్ వాల్ (ప్రొటక్షన్ వాల్) నిర్మిస్తాం.
- పెద్దవాగు కోసం రూ.12.32 కోట్లు మంజూరు. కుమురంభీం, నీల్వాయి, వట్టివాగు, గొల్లవాగు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కోసం రూ.400 కోట్లు కేటాయించాం.
- సదర్‌మాట్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నీళ్లు అందిస్తాం.
- చనాఖా–కొరటా మూడు నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం. నీళ్లు పారిస్తాం.
- పెన్‌గంగ పైన పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం.
- బుగ్గారం, తేజాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు.
- ఐటీడీఏను పరిపుష్టి చేస్తాం.
- అటవీ నుంచి వెదురు, మట్టి తెచ్చుకునే విషయంలో ఇబ్బందులు ఎదురు కాకుండా చూస్తాం.
- పోడు భూములకు పట్టాలిస్తాం.. రుణాలు ఇస్తాం.. సమగ్ర భూచట్టాన్ని తీసుకువస్తున్నాం.

స్టాల్స్ సందర్శించి.. చెక్కులు అందజేసి

డిప్యూటీ సీఎం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరి పిప్రికి మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. మార్కెటింగ్, వస్తువుల ఉత్పత్తి వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్వయం ఉపాధితో రాణిస్తున్న వారితో మాట్లాడారు. ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను తిలకించారు. ఎస్సీ కార్పొరేషన్, ట్రైకార్, ఐటీడీఏల ద్వారా మంజూరైన బ్యాంక్ లింకేజీ చెక్కులను మహిళలకు అందజేశారు. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ పాయింట్లు సాధించిన 11మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఐసీడీఎస్ ద్వారా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. సభ ముగిసిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భట్టి పిప్రిలోనే భోజనం చేశారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తూ..



స్టాళ్లలోని వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తూ..

సమస్యలు తీర్చండి.. ఉమ్మడి జిల్లాను ఆదుకోండి

ఉప ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యేలు
ఇచ్చోడ: సభకు హాజరైన బోథ్, ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, ప్రేంసాగర్‌రావు నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. పరిష్కరించాలని డిప్యూటీ సీఎం విక్రమార్కను కోరారు.

కుప్టికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి



బోథ్ ప్రాంత రైతుల అవసరాలు దృష్టిలో ఉంచుకొని కుప్టి ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి. ఐదు మండలాలకు సాగునీరు అందించేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. నియోజకవర్గంలోని 29 మారుమూల గిరిజన గ్రామాలకు అత్యవసరంగా రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించాలి. 19 చెరువులకు మంజూరైన రూ.140 కోట్లు వెంటనే విడుదల చేయాలి. అడేగామ(కే) వద్ద నిర్మించిన చెరువుకు కాలువ పనులు పూర్తిచేసి 1200 ఎకరాలకు సాగునీరు అందించేలా చొరవ చూపాలి. అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించి ఆయా మార్గాల్లో రహదారుల పనులు పూర్తి చేయాలి. దేగామ ముంపు బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలి. నూతనంగా ఏర్పడిన భీంపూర్, సిరికొండ, సొనాల మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి.
– అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

డబుల్ రోడ్డు పనులకు అనుమతులివ్వాలి



ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వరకు డబుల్ రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు ఇప్పించి ఉమ్మడి జిల్లాకు న్యాయం చేయాలి. మూడు జిల్లాలను కలిపే ఈ రోడ్లు టైగర్‌జోన్ పరిధిలో ఉండటంతో కొన్నేళ్లుగా పనులు మంజూరు కావడం లేదు. ఖానాపూర్ నియోజకవర్గంలో అల్లంపల్లి, వాయిపేట్ వంటి మారుమూల గ్రామాలకు 108 సైతం వెళ్లలేని పరిస్థితి. ఏజెన్సీ పరిధిలోని అనేక గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక గిరిపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు వెంటనే రోడ్డు వసతి కల్పించాలి. రైతు రుణమాఫీ విషయంలో మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంకులలో లోపాలను సరిదిద్ది అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చొరవ చూపాలి.
– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

వట్టివాగు ద్వారా సాగు నీరందించాలి



వట్టివాగు ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి నాలుగు టీఎంసీల నీటిని లింగాపూర్, సిర్పూర్, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల రైతులకు అందించాలి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన మత్తడి వాగు ప్రాజెక్టుకు కాలువల పనులు త్వరగా పూర్తిచేయాలి. మంచిర్యాలలో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి. కుమురంభీం ప్రాజెక్టు కెనాల్ పనులు సైతం త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలి.
– ప్రేంసాగర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ అభిలాష అభినవ్

భైంసారూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం వానల్‌పాడ్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా గ్రామ పంచాయతీ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహారలోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా స్వచ్ఛత పాటించాలన్నారు. గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుకున్నప్పుడే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, ఎంఈవో సుభాష్, నాయకులు ముత్యంరెడ్డి, ఈశ్వర్, గణేశ్, రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సామాజిక బాధ్యతగా తీసుకోవాలి
నర్సాపూర్(జి): స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. రాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వార్డుల్లో పర్యటించి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తీయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, డీఎల్‌పీవో రమేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

నిర్మల్‌రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. పర్యావరణ హితకార ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల వినియోగం, తయారీపై నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో విద్యార్థులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సహజ వనరుల వినియోగం, కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని ఈకో క్లబ్ ఉన్న పాఠశాలల నుండి 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో ముగ్గురు చొప్పున 150 మంది శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పరిశీలకుడిగా రాష్ట్ర హరిత దళం ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

- సమస్యలు తెలుసుకున్న డీసీహెచ్ఎస్

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపూర్: ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్యం తీరుపై మంగళవారం 'సాక్షి' విజిట్ చేపట్టింది. ఈ మేరకు బుధవారం జిల్లాపేజీలో 'వచ్చినప్పుడే వైద్యం' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి భట్టి విక్రమార్క వరకు చేరింది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఆస్పత్రులను పర్యవేక్షించారు. కొత్తగా డీసీహెచ్ఎస్ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సురేష్‌కుమార్ ఖానాపూర్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అన్ని వార్డులను సందర్శించి రోగుల కేస్‌షీట్లను పరిశీలించారు. ఓ వార్డులో ఒకే బెడ్‌పై ఇద్దరు పేషెంట్లు ఉండగా వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ గార్డులు, వార్డుబాయ్‌లు సెలైన్ పెడుతున్నారని పలువురు రోగులు తెలిపారు. అంతకుముందు వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ఖాళీలు, ఇతర సౌకర్యాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగి సమస్యను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి అంబులెన్స్‌తో పాటు డిజిటల్ ఎక్స్‌రే కోసం వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

నైపుణ్యం కోసమే స్థాయీ పరీక్షలు

లోకేశ్వరం : విద్యార్థుల నైపుణ్యం కోసమే స్థాయీ పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) నర్సయ్య అన్నారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థాయీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల తరగతి గదులు, అభ్యాసకుల మూల్యాంకనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో రాజేశ్వర్, హెచ్ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శుభఘడియలు రానే వచ్చాయి

- 5 నుంచి నెలరోజులు మంచి ముహూర్తాలు

నేరడిగొండ: శుభ ఘడియలు రానే వచ్చాయి.. మూఢం కారణంగా మూడు నెలలుగా శుభకార్యాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఈనెల 5 నుంచి శ్రావణమాసం మొదలైందని, శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయని వేద పండితుడు ఎల్కూచి శ్రావణ్ కుమార్‌జోషి తెలిపారు. 7 నుంచి 28వ తేదీ వరకు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీలు మంచివని తెలిపారు. 17, 18వ తేదీల్లో అత్యంత శుభ ముహూర్తాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్రావణమాసం సెప్టెంబర్ 3తో ముగుస్తుందని వివరించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతి

భైంసారూరల్: మద్యం మత్తులో ఒకరు కిందపడి మృతిచెందాడు. ఏఎస్సై మారుతి కథనం ప్రకారం..మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ప్యాట చిన్న మహేశ్ (41) మద్యం మత్తులో మంగళవారం రాత్రి తన భార్య లక్ష్మితో గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వాలని అడుగగా లేవని చెప్పడంతో బయటకు వెళ్లాడు. కొద్ది దూరంలో కిందపడి మృతిచెందాడు. బుధవారం ఉదయం మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేద ఆడపడుచుకు తులం బంగారం



తులం బంగారం అందిస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మున్నూరుకాపు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద ఆడపడుచుకి బుధవారం తులం బంగారం అందించారు. మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన సీపతి భవానికి తల్లిదండ్రులు లేకపోవడంతో వివాహ కార్యక్రమాల నిమిత్తం మున్నూర్‌కాపు కులపెద్దలు, సభ్యులు తులం బంగారు అందించి చేయూతనందించారు. గంట రాజన్న, సాదని శివన్న, బొడ్డు కిరణ్, కందుకూరి జీవన్, నాగన్న, సీపతి తి రుపతి, చెంచాల రమణ, విజయ్, ధరణి రాజేశ్, చరణ్ నరేశ్, నర్సయ్య, సత్తన్న ఉన్నారు.

మోకుదెబ్బ జిల్లాల ఇన్‌చార్జీల నియామకం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దివ్యనగర్‌లో బుధవారం గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ పొలిట్ బ్యూరో సమావేశం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలను నియమించారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ ఇన్‌చార్జిగా నర్సాగౌడ్, ఖమ్మంకు సిద్ధిరాములు గౌడ్, మెదక్‌కు బాలరాజ్ గౌడ్, రంగారెడ్డికి బాలేశంగౌడ్, హైదరాబాద్‌కు సురేష్‌గౌడ్, కరీంనగర్‌కు నర్సింహులుగౌడ్, నల్గొండకు అనంతుల రమేశ్ గౌడ్, వరంగల్, ఆదిలాబాద్‌కు ఆంజనేయులు గౌడ్‌ను నియమించారు.

ఆచారం.. మారేదెలా..!

- మహిళల నెలసరి సమయంలో కుప్పిలో విడిది
- గత రెండేళ్లలో పాముకాటుతో ఇద్దరు మృత్యువాత



ఇటీవల న్యూసోమార్‌పేటలో పాముకాటుతో యువతి మృతిచెందిన కుప్పి

సాక్షి, మంచిర్యాలడెస్క్: మహిళలు, యువతుల్లో రుతుక్రమం అనేది సహజమైన జీవ ప్రక్రియ. ప్రతీ మహిళ జీవన విధానంలో భాగమైన రుతుస్రావ ప్రక్రియపై పురాతన కాలం నుంచి అనేక ఆచారాలు, నమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యావంతులు, చైతన్యవంతం కావడంతో చాలా సామాజిక వర్గాల్లో నెలసరి సమయంలో పాటించే ఆచారాలు క్రమంగా దూరమయ్యాయి. కానీ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం ఆదివాసీల్లో మాత్రం కుప్పిలో ఉండాలనే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ ఆచారం పాటించే క్రమంలో సరైన విడిది లేక గత రెండేళ్లలో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం ధర్మడుగులో రెండేళ్ల క్రితం మహిళ, ఇదే మండలంలోని న్యూసోమార్‌పేట్‌లో యువతి సిడాం లక్ష్మి ఆదివారం పాముకాటుతో చనిపోయారు.

కుప్పి అంటే..

నెలసరి సమయంలో మహిళలు, యువతులు ఆచారం ప్రకారం ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిదినే కుప్పి అంటారు. నెలసరి పూర్తయ్యే వరకు వారు అందులోనే ఉండాల్సి ఉంటుంది. అవసరమైన ఆహార పదార్థాలు, నీరు కుటుంబ సభ్యులు అందిస్తారు. పూరిపాకలో ఉండాలంటే నరకమే కనిపిస్తుంది. ఆ సమయంలో ఒంటరిగా ఉండడం వల్ల మానసికంగా కుంగిపోయే అవకాశం లేకపోలేదు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆశ్రయమిస్తే..

గతంలో పాముకాటుతో మహిళ మృతిచెందిన సమయంలో ఈ ఆచారం విషయం అప్పటి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ దృష్టికి వెళ్లింది. మహిళలను చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశారు. మరణాలనైనా అరికట్టాలని మహిళలకు నెలసరి సమయంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ్రయం కల్పించాలని భావించారు. కానీ ఆ విషయంలో ముందడుగు పడలేదు. ఇప్పటికైనా మహిళలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతి కల్పిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.

మనమూ మారాలి..

మహిళలు, సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో షార్ట్‌ఫిలిం నిర్మించారు. 'ఎన్ అన్‌స్పీకేబుల్ పెయిన్' పేరిట నిర్మించిన 5.23నిమిషాల నిడివి గల ఈ చిత్రాన్ని యూట్యూబ్‌లో 4,200మందికి పైగా వీక్షించారు. గ్రామంలో నెలసరి వచ్చిన వారిని గ్రామ శివారులోని పూరిపాకలో ఉంచుతారు. అలా పాటించని వారు ఒక కోడిని జరిమానా ఇవ్వాల్సి ఉంటుంది. ఓ తండ్రి తన పిల్లలను పూరిపాకలో ఉంచకుండా ఊరి పెద్ద వద్ద పంచాయితీలో జరిమానా చెల్లిస్తుంటాడు. స్త్రీలకు స్వేచ్ఛ, ఆత్మగౌరవం ముఖ్యమని, రోజులు మారాయి మనమూ మారాలి అంటూ ఆ తండ్రి పాత్ర సందేశాన్ని ఇస్తుంది. అనారోగ్యాన్ని తెచ్చే మద్యం బహిరంగ కొనుగోలు చేస్తున్నాం.. కానీ ఆరోగ్యాన్ని ఇచ్చే సానిటరి ప్యాడ్స్ కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నామని, ప్యాడ్స్ ఆనందంగా స్వీకరిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం అంటూ అధికారి పాత్ర చెప్పడంతో గ్రామస్తుల్లో చైతన్యం వస్తుంది. పూరిపాకను తొలగిస్తారు. అలాంటి చైతన్యం అందరిలోనూ రావాల్సిన అవసరం ఉంది.

చైతన్యవంతం కావాలి..



కొలాం సామాజిక వర్గంలో కూడా చైతన్యం రావాల్సి ఉంది. ఆచారం, సంప్రదాయాలను కూడా కాపాడుకోవాల్సి ఉంది. పాముకాటుతో యువతి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గ్రామస్తులు ఏకమై గ్రామంలోనే షెడ్డు వంటిది ఏర్పాటు చేసి వసతులు కల్పించాలి. ఫ్యాన్, బల్బ్ ఉండేలా చూస్తే బాగుంటుంది.

– కుమ్ర ఈశ్వరిబాయి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు



కంటెయినర్ హౌజ్

మోడల్ హౌజ్.. నిరుపయోగం..

ఏడాది క్రితం ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డి పని చేసిన సమయంలో మహిళల ఇబ్బందులు దూరం చేయడానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి చెరువుగూడలో మోడల్ హౌజ్(కంటెయినర్ హౌజ్) ఏర్పాటు చేయించారు. ఈ మోడల్ హౌజ్‌లో అటాచ్డ్ బాత్రూం, ఫ్యాన్, బల్బ్, ప్యాడ్స్, అద్దం, వాటర్ ట్యాంకు ఉంటాయి. ఇందులోని సౌకర్యాలపై అప్పట్లో ఏపీవో పీవీటీజీ భాస్కర్ మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల నెలసరి సమయంలో పూరిపాకల్లో ఉండడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండడంతో దీన్ని ఐటీడీఏ నిధులతో ఏర్పాటు చేయించారు. కానీ ఎవరూ వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. వాటర్ లేకుండా పోయింది. అధికారులు మహిళలకు అవగాహన కల్పించి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్(ఫైల్)

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య



శాంతాబాయి (ఫైల్)

నార్నూర్: పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రహీంపాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎంపల్లి (తండా)కు చెందిన రాథోడ్ శాంతాబాయి (56) గత ఐదేళ్లుగా పైల్స్, కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులందరూ కలిసి రాత్రి భోజనం చేస్తుండగా ఆమె గదిలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం బుధవారం ఉట్నూర్ ఆసుపత్రి తరలించగా వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త బలిరాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వీఆర్ఏ..

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి వీఆర్ఏ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై సునీత కథనం ప్రకారం.. మండలంలోని అంకోలి పంచాయతీ వీఆర్ఏగా ఆడ భూమన్న (57) పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు 108లో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కుభీర్: మండలంలోని రంజని తండాకు చెందిన జాదవ్ గోపాల్(35) మద్యం మత్తులో బుధవారం సాయంత్రం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.రవీందర్ కథనం ప్రకారం.. గోపాల్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మద్యం మత్తులో గ్రామ శివారు వ్యవసాయ బావిలో దూకాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. భార్య జాదవ్ వనిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు



నిజామాబాద్ వెళ్లే బస్సు ఆగిపోవడంతో మరో బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు



మొరాయించడంతో బస్సును తోస్తున్న ప్రయాణికులు (ఫైల్)

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

భైంసాటౌన్: భైంసా డిపోలో ఆర్టీసీ బస్సులతోపాటు అద్దె బస్సులు కొన్ని తరచూ మొరాయిస్తున్నాయి. మార్గమధ్యలోనే ఆగిపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బుధవారం భైంసా నుంచి ధర్మాబాద్ వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు బస్టాండ్ గేట్ దాటకుండానే ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు కొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లగా, మరికొందరు మరో బస్సు కోసం వేచి చూశారు. ఈనెల 4న భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న అద్దె బస్సు తరోడ వద్ద ఆగిపోయింది. దీంతో వెనుకే వచ్చిన మరో బస్సులో ప్రయాణికులను సర్దుబాటు చేశారు. అప్పటికే అందులో సీట్లు నిండిపోగా, వారు కూడా ఎక్కడంతో ఇబ్బంది పడ్డారు. ఇటీవల బస్టాండ్‌లోనే కుభీర్ వెళ్లే బస్సు మొరాయించడంతో ప్రయాణికులు కిందకు దిగి తోయడంతో ముందుకు కదిలింది. ఇలా, బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఈ విషయమై డీఎం హరిప్రసాద్‌ను ఫోన్‌లో సంప్రదించగా మెకానికల్ సమస్యలతో బస్సులు మొరాయిస్తుంటాయని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ మోసాల ముఠా అరెస్టు

- రాజస్తాన్‌కు చెందిన ముగ్గురి రిమాండ్
- 8 సెల్‌ఫోన్లు, 10 ఏటీఎం కార్డులు, గుర్తింపు కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు

నిర్మల్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి సైబర్ మోసాలకు పాల్పడుతున్న రాజస్తాన్ ముఠాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, 10 ఏటీఎం కార్డులు, గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో కలిసి ఎస్పీ జానకి షర్మిల బుధవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన సలీంఖాన్, షేక్ నసీం, తస్లీం ఖాన్ ముఠాగా ఏర్పడి సైబర్ మోసాలకు పాల్పడేవారు. ఇందులో సలీంఖాన్ కుంటాల మండలం అంబకంటి గ్రామానికి వచ్చాడు. కుంటాలకు చెందిన యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. రాజస్తాన్ నుంచి షేక్ నసీం, తస్లీం ఖాన్‌లు సలీం వద్దకు వచ్చి ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముగ్గురు రూ.50 వేల నగదు కోసం గతనెల 24న కుంటాలలో ఓ సర్వీస్ సెంటర్ వద్దకు వెళ్లారు తన వద్ద నగదు లేదని నిర్వాహకుడు చెప్పాడు. ఆ సమయంలో జుట్టు గజేందర్ అనే బట్టల వ్యాపారి నగదును అకౌంట్లో వేసుకునేందుకు వచ్చాడు. రూ.50 వేల నగదు మీ అకౌంట్లో పంపిస్తానని వీరు నమ్మించారు. ఫ్రాడ్ అకౌంట్ నుంచి డబ్బులు జమ అయినట్లు అతని సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపించి అక్కడి నుంచి జారుకున్నారు. నగదు విత్ డ్రా కోసం గజేందర్ గతనెల 27న బ్యాంక్‌కు వెళ్తే అకౌంట్ ఫ్రీజ్ అయినట్లు తెలుసుకుని కంగుతిన్నాడు. బ్యాంకు అధికారులను అడిగితే మోసపోయానని తెలుసుకున్నాడు. దీంతో కుంటాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం ముగ్గురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన భైంసా ఏఎస్పీతోపాటు భైంసా రూరల్ సీఐ నైలు, కుంటాల ఎస్సై రజినీకాంత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.జ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో లావాదేవీలు జరుపవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930 ఫోన్‌కి సమాచారం అందించాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఒకే ఒక్కడు..!



డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న రతన్

- భైంసా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బదిలీలతో పరిస్థితి

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా సబ్ రిజిస్ట్రార్ మహేందర్‌రెడ్డి ఆర్మూర్‌కు బదిలీ కాగా, జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మి, దినేష్‌లు ఆసిఫాబాద్, మంచిర్యాలకు బదిలీ అయ్యారు. ఖానాపూర్ నుంచి రతన్ అనే జూనియర్ అసిస్టెంట్ ఇక్కడికి బదిలీపై రాగా, సబ్ రిజిస్ట్రార్, మరో జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో కార్యాలయంలో ఒకే ఒక్కడుగా పరిస్థితి నెలకొంది. ఆయనే జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే, సబ్ రిజిస్ట్రార్‌గా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా భైంసా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజు 25–30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ప్రస్తుతం అటెండర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ ఉండడంతో పనిభారం పెరిగి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఆలస్యమవుతోందని పలువురు వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరిని కేటాయించకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతోంది. అయితే నిజామాబాద్‌కు చెందిన సబ్ రిజిస్ట్రార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. వారు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తే ఇబ్బంది తొలగనుంది.

బీఈడీ కళాశాల సందర్శన



గదులు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ బీఈడీ కళాశాలను కేయూ అఫిషిలేషన్ కమిటీ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు రాంచందర్, రాంనాథ్ కిషన్, అసిస్టెంట్ రిజిస్టార్ వెంకటేశ్వర్లు, బోర్డు ఏవ్ స్టడీస్ చైర్మన్ ఆర్.రణధీర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. కళాశాలలో గదులు పరిశీలించి, గిరిజన ఛాత్రోపాధ్యాయులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అధ్యాపక బృందం మాణిక్‌రావు, రామారావు, రవి, రాందాస్, విరావ్, జగన్, శ్రీనివాస్, కపిల్‌కుమార్, సుష్మిత ఉన్నారు.

నాగులపంచమి పూజకు ఏర్పాట్లు



శుభ్రం చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఈ నెల 9న నిర్వహించే నాగుల పంచమి పూజ ఏర్పాట్లను మెస్రం వంశీయులు ముమ్మరం చేశారు. ఆలయం పరిసరాల్లో బుధవారం స్వచ్ఛత పనులు, గర్భగుడి పూజ సామగ్రిని శుభ్రం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. జాతర నిర్వహణ ప్రాంతంలో వ్యాపారులు రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి రిమాండ్

పెంబి: మైనర్ బాలికలను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు యాపలగూడకు చెందిన చిక్రం జలపతిని బుధవారం ఖానాపూర్ బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. నిర్మల్ జిల్లా జైలుకు తరలించామన్నారు.

ఇద్దరిపై కేసు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామ తెల్లకల్లు బట్టి వద్ద మంగళవారం రాత్రి ఇద్దరు ఒకరిపై దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. షేక్ నహీం, బండారి రాజులు పాత గొడవలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన మంగలి నవీన్‌పై దాడి చేసి దుర్భాషలాడారు. బాధితుడు నవీన్ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

ఎదులాపురం: శ్యాంపూర్ పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బొంపల్లి దినేశ్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దినేశ్ గత కొంత కాలంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం హైదరాబాద్ నుంచి రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

కలప పట్టివేత

పెంబి: ఆటోలో తరలిస్తున్న కలప దుంగలను పెంబితండా వద్ద మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు పెంబి రేంజ్ ఎఫ్ఆర్వో రమేశ్‌రావు తెలిపారు. వీటి రూ.6 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలకు తాళం



నర్సాపూర్(జి): మండలంలోని అంజనితండా ఏకోపాధ్యాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై వెళ్లారు. టీచర్ లేక విద్యార్థులు తల్లిదండ్రులతో వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. బుధవారం పాఠశాలకు తాళం వేసి ఉంది. విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని నియమించేలా చూడాలని ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బాబునాయక్ కోరారు.

గోదావరినదికి పంచహారతి



బాసర: బాసర గోదావరి నదికి పంచహారతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయరామారావు ఆదేశాలతో ఆలయ వైదిక బృందం, అర్చకులు నదికి హారతిని ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు.

రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి



పొన్కల్ సదర్‌మాట్ బ్యారేజీని పరిశీలిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మామడ: సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని పొన్కల్ గోదావరిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని బుధవారం సందర్శించారు. బ్యారేజీ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న నాగదేవతాలయం టెండర్ ప్రక్రియను పూర్తి చేసి నూతన ఆలయం నిర్మించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. బ్యారేజీ వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ఇక్కడి ప్రాంత రైతుల వ్యవసాయ భూములకు సాగునీరందించేలా లిఫ్ట్ ఇరిగేషన్‌ను మంజూరుకు కృషి చేస్తానన్నారు. నీటిపారుదలశాఖ ఈఈ లక్ష్మి, నాయకులు బాపురెడ్డి, రాజారెడ్డి, రావుల రాంనాథ్, నరేశ్ తదితరులు ఉన్నారు.


గురుకుల పోస్టుల్లో మెరిట్ వారికి అవకాశం కల్పించాలి

నిర్మల్‌ఖిల్లా: గురుకుల పోస్టుల్లో మెరిట్ ఉన్న వారితో భర్తీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల పోస్టులు బ్యాక్ లాగ్‌లో ఉండకుండా తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు అవకాశం కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. గురుకుల అభ్యర్థుల ప్రతినిధులు సోమేశ్, సంతోష్, ధనుంజయ్, నరేందర్, సుమన్ తదితరులు ఉన్నారు.

సరస్వతీ కెనాల్‌కు నీటి విడుదల

సోన్: మండలంలో గల ఎస్సారెస్పీ నుంచి సరస్వతీ కెనాల్‌కు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు కోసం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. జక్క రాజేశ్వర్, సరికెల గంగన్న, మానస హరీష్‌రెడ్డి, అడ్వాల రమేశ్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్, గంగారెడ్డి, ఉన్నారు.

'సీఎం సార్..నన్ను ఇండియాకు రప్పించండి'



వీడియోలో తన బాధను చెప్పుకుంటున్న రాందేవ్

ముథోల్: 'సీఎం సార్ నన్ను కాపాడండి.. ఇండియాకు రప్పించండి..' అంటూ నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ రాందేవ్ వేడుకుంటూ చేసిన వీడియో వైరల్‌గా మారింది. రాథోడ్ రాందేవ్ పది నెలల క్రితం బతుకుదెరువు కోసం సౌదీ అరేబియా దేశానికి నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం దత్తాపూర్ చెందిన ఏజెంట్ ద్వారా వెళ్లాడు. ఇంట్లో పని చేయాలని చెప్పి పంపించాడు. తీరా అక్కడికి వెళ్లాక సౌదీ స్టేట్ వద్ద ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేయిస్తున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక అనారోగ్యం పాలైనా యజమాని వైద్యం చేయించడం లేదని, సరైన జీతం ఇవ్వడం లేదని, ఇండియాకు రప్పించకపోతే చావే శరణ్యమని సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ముథోల్ ఎమ్మెల్యేను వేడుకున్నాడు. ఇతడి కూతురికి ఇటీవల పెళ్లి చేసి పంపించారు. కుమారుడు ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. తన భర్తను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని భార్య సోనుబాయి అధికారులను కోరుతోంది.

సాగుకు అడ్డు తగులుతున్నారని..

- 8 మంది ఎస్టీ లబ్ధిదారుల ఆవేదన
- ఎమ్మెల్యే రామారావు పటేల్‌కి దృష్టికి

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడకు చెందిన 8 మంది ఎస్టీ లబ్ధిదారులకు గత ప్రభుత్వం మూడెకరాల చొప్పున సాగు భూమి కేటాయిస్తూ ఆర్ఓఎఫ్ఆర్ ద్వారా అటవీ హక్కు పత్రాలు అందజేసింది. సాగు చేయడానికి వెళ్తే అటవీ అధికారులు అడ్డు తగులుతూ కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లమాడకు బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి హాజరైన ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.